
సాక్షి ఒడిశా

ఆదివారం । 1 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు


భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,53,480లు, బంగారం 3.6 గ్రాములు, వెండి 22.5 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



హ్యాపీ న్యూ ఇయర్

భువనేశ్వర్: హ్యాపీ న్యూ ఇయర్ నినాదంతో పూరీ సాగర తీరంలో మానస్‌కుమార్ సాహు తీర్చిదిద్దిన సైకత శిల్పం

రెండో రోజుకు క్రైం బ్రాంచ్ దర్యాప్తు - IIలో



న్యూస్‌రీల్

గంజాం ఎస్పీగా జగమోహన్ మీనన్



ఎస్పీ జగమోహన్ మీనన్

బరంపురం: గంజాం జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా జగమోహన్ మీనన్ నియమితులయ్యారు. రాష్ట్ర హోంశాఖ శుక్రవారం రాత్రి భారీగా ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్వర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జగమోహన్ గంజాం జిల్లా ఎస్పీగా బదిలీ చేయగా, అంతకుముందు ఆయన అంగూల్ జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించేవారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న ఎస్పీ బ్రిజేష్‌కుమార్ పదోన్నతిపై అంగూల్ జిల్లా డీఐజీగా బదిలీ అయ్యారు.

భద్రతా ఏర్పాట్లు పరిశీలన

- 9 హోటళ్లలో క్రీడాకారుల బస: డీసీపీ



హోటల్‌లో భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న డీసీపీ ప్రతీక్ సింఘ్

భువనేశ్వర్: రాష్ట్ర రాజధాని నగరంలోని కళింగ స్టేడియంలో ఈనెల 13 నుంచి 29 వరకు జరగనున్న ఎఫ్ఐహెచ్ హాకీ పురుషుల ప్రపంచకప్–2023 దృష్ట్యా నగరంలో పలు హోటళ్లను డీసీపీ ప్రతీక్ సింగ్ శనివారం సందర్శించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. హోటళ్లలో క్రీడాకారులకు వసతి, ఇతర సదుపాయాలు, భద్రతా అంశాలపై ఆయన హోటల్ అధికారులతో చర్చించారు. అలాగే భువనేశ్వర్ లోని 9 హోటళ్లలో క్రీడాకారుల బసకు ఏర్పాట్లు చేశారు. వీటి ప్రాంగణాల్లో అనుక్షణం పటిష్ట భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. క్రీడాకారుల భద్రత కోసం ప్రతి హోటల్ వద్ద ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎస్ఐలు, ముగ్గురు సిగ్నల్ ఏఎస్ఐలు, 6 పోలీసు వాహనాలు, 2 ప్లాటూన్ల పోలీసు దళాలు, 3 ప్లాటూన్ల హోంగార్డులను నియమించారు.

పులి చర్మం స్వాధీనం



పట్టుబడిన పులి చర్మంతో నిందితుడు, పోలీసులు

కొరాపుట్: పెద్దపులి చర్మాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్‌డీపీఓ చంద్రశేఖర్ హొత్తా శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరించారు. నవరంగ్‌పూర్ జిల్లా ఎస్పీ ఎస్.సుశ్రీకి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ సూర్య పండా నేతృత్వంలో పోలీసుల ప్రత్యేక బృందం పపడాహండి మీపంలోని డీర్ పార్క్ వద్ద సోదాలు జరిపారు. విక్రయానికి సిద్ధంగా ఉన్న పులిచర్మాన్ని పపడాహండి సమితి కేంద్రం సత్నామి వీధిలోని కమల్‌కుమార్ మహంతి నుంచి స్వాధీనం చేసుకున్నారు. దీనిని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపుతామని పేర్కొన్నారు. కేసులో లోతైన దర్యాప్తు చేస్తామని, మిగతా వారి పాత్రపై ఆధారాలు సేకరిస్తున్నామన్నారు.

జాతీయ పోటీలకు గంజాం బాక్సర్లు



జాతీయ బాక్సింగ్ పోటీలకు పయనమైన గంజాం బాక్సర్లు

బరంపురం: హర్యానాలో జరగనున్న జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు గంజాం జిల్లా నుంచి యువ బాక్సర్లు బయలుదేరి వెళ్లారు. ఆదివారం నుంచి ఈనెల 5వరకు జరగనున్న ఈ పోటీల్లో ఒడిశా అమాతర్ బాక్సింగ్ సంఘం, ఒడిశా ఒలింపిక్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరు బరంపురం రైల్వేస్టేషన్ నుంచి రైలులో శనివారం హర్యానా పయనమయ్యారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులను నగర ప్రముఖులు, సంఘం ప్రతినిధులు అభినందించి, ప్రోత్సహించారు.



పర్యాటకం, ఆధ్యాత్మిక మేళవింపు లింగరాజ దేవస్థానం



రౌర్కెలా లోని బిర్సా ముండా హాకీ స్టేడియం

ఒడిశా.. 2.0

- అన్నింటా అగ్రగామిగా.. ఒడిశా
- 2022లో విపత్తు లను సమర్థవంతంగా ఎదుర్కొన్న రాష్ట్రం
- కొత్త ఏడాదిలో.. అభివృద్ధికి సరికొత్త ప్రణాళికలు
- హాకీ ప్రపంచ కప్‌తో నూతనోత్సాహానికి శ్రీకారం

రౌండప్ 2022



సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ చేతుల మీదుగా జీవన సాఫల్య పురస్కారం అందుకుంటున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా ముద్రపడిన రాష్ట్రం.. నేడు అగ్రగామిగా నిరంతర అభివృద్ధితో దూసుకు పోతోంది. కరోనా విపత్తు నుంచి విజయవంతంగా బయట పడటంతో పాటు 2022 సంవత్సరం రాష్ట్ర పురోగతికి సరికొత్త మలుపు తిప్పింది. దేశ విదేశాల నుంచి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. క్రీడలు, పర్యటన, వ్యవసాయం, ఆహార భద్రత, మహిళ సాధికారిత, విపత్తు నిర్వహణలో రాష్ట్రం ప్రపంచ దేశాలకు మార్గదర్శిగా ఎదిగింది. పాలనా పగ్గాలతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సుదూర సంకల్పం, విపక్షాల ఆరోగ్యదాయకమైన విమర్శనాస్త్రాల దాడి, సాధారణ ప్రజానీకం పదునైన చైతన్యం, పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థతో రాష్ట్రాన్ని అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించాయి. 2023 సంవత్సరంలో సరికొత్త పురోగతి పథకాలు, వాస్తవ పోకడలో చోటు చేసుకోవడం తథ్యం. ఈ వ్యూహాత్మక కార్యాచరణ బీజేడీ 100 ఏళ్ల పాలనకు దోహదపడుతుందని పార్టీ అధ్యక్షుని హోదాలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దృఢ సంకల్పాన్ని ప్రకటించారు.

క్రీడోత్సాహంతో..

క్రీడోత్సాహంతో కొత్త సంవత్సరం ప్రారంభం కానున్నది. క్రీడా రంగంలో రాష్ట్రం.. కేంద్రంగా ఆవిర్భవించింది. రౌర్కెలాలో జాతీయ స్థాయిలో అతిపెద్ద బిర్సా ముండా హాకీ స్టేడియం జనవరిలో ప్రారంభించనున్నారు. పురుషుల హాకీ ప్రపంచకప్ మ్యాచ్‌లతో ఈ స్టేడియం ఆరంభమై, సరికొత్త చరిత్రతో వెలుగొందనుంది. భువనేశ్వర్ కళింగ స్టేడియంలో సంయుక్తంగా ప్రపంచకప్ మ్యాచ్‌లు అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. నాలుగేళ్లకు ఒకసారి జరిగే హాకీ సంబరాలకు దేశ వ్యాప్తంగా రాష్ట్ర ముఖ్యమంత్రులను సీఎం నవీన్ పట్నాయక్ ప్రత్యేకంగా ఆహ్వానించారు.

సరికొత్త హంగులతో..

రాష్ట్రంలో పర్యటన రంగం బహుముఖంగా అభివృద్ధి చెందుతోంది. మారుమూల ప్రాంతాల నుంచి అంతర్జాతీయ ప్రాంతాలకు ప్రత్యక్ష విమానయాన సదుపాయాలకు మార్గం సుగమమైంది. బ్యాంకాక్, దుబాయ్, సింగపూర్ ప్రాంతాలకు ప్రత్యక్ష విమానయానం కోసం మంత్రిమండలి ఖరారు చేసింది. మారుమూల కొరాపుట్ జిల్లా నుంచి రాజధాని భువనేశ్వర్ నగరానికి ప్రత్యక్ష విమానయాన సదుపాయం ప్రారంభించారు. ప్రకృతి రమణీయ ప్రాంతాలు ఈకో టూరిజం, ఆధ్యాత్మిక ఆహ్లాద ప్రాంగణాలతో పవిత్ర పుణ్యక్షేత్రాలు, వర్తక వాణిజ్య ముఖ ద్వారాలుగా ఓడరేవులు, వన్యప్రాణుల సంతతి సంరక్షణతో ప్రాకృతిక పర్యటన కేంద్రాల అభివృద్ధి పనులు శరవేగంగా ముగించేందుకు భారీ ప్రణాళికల కార్యాచరణ చురుగ్గా కొనసాగుతోంది.



కోవిడ్ నియంత్రణలో కొత్త ఒరవడి వాక్ ఇన్ వ్యాక్సినేషన్



పోప్ ఫ్రాన్సిస్‌తో సీఎం నవీన్ పరస్పర అభివాదం

ఏటా పర్యాటక సీజన్ పురస్కరించుకుని జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన కళాకారులతో శాస్త్రీయ, జానపద, సంప్రదాయ నృత్యాలు, సంగీతం, సైకత శిల్పాల ప్రదర్శన, నోరూరించే రుచికరమైన వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్ ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఉద్యోగం, ఉపాధి రంగాల్లో సంస్కరణలు యువతకు కొత్త ఉత్సాహం ప్రేరేపించాయి. దీర్ఘకాలంగా కొనసాగిన కాంట్రాక్టు ప్రాతిపదిక ఉద్యోగ వ్యవస్థకు 2022లో స్వస్తి పలికారు. 5టీ, మేక్ ఇన్ ఒడిశా, స్టార్ట్ అప్ కార్యక్రమాల కింద యువతకు ఉత్సాహభరితమైన ఉద్యోగం, ఉపాధి వనరులను అందుబాటులోకి తీసుకు వచ్చారు.

మహిళా సాధికారిత..

కరోనా విపత్తును సమయ స్ఫూర్తిగా మలచుకుని మహిళా సాధికారితకు బలమైన బీజం నాటారు. కోవిడ్ ఆస్పత్రులు, టీకాల ప్రదానం వగైరా కార్యకలాపాలతో మాతా శిశు సంరక్షణ, విద్యుత్ బిల్లు సేకరణ, తృణధాన్యాల ఉత్పాదన, జాతీయ పతాకాల తయారీ, ఇతరతేర రంగాల్లో మహిళా స్వయం సహాయక బృందాలు(ఎస్‌హెచ్‌జీ), అంగన్‌వాడీ, మిషన్‌శక్తి సాధికారిత సొంతం చేసుకున్నాయి. రూ.5 లక్షల వరకు వడ్డీ రహిత రుణ సదుపాయంతో సూక్ష్మ, లఘు, మధ్య(ఎంఎస్ఎంఈ) వర్తక వ్యాపార రంగాల్లో మిషన్‌శక్తి వర్గాల సాధికారితకు కొత్త పునాది వేశారు.

పెను తుపాను గుణపాఠం..

విపత్తు నిర్వహణలో ఐక్యరాజ్య సమితి గుర్తింపు సాధించిన రాష్ట్రం.. 1999 అక్టోబరులో సంభవించిన ఘోరాతి ఘోరమైన తుపాను నుంచి గుణపాఠం నేర్చుకుంది. సూపర్ సైక్లోన్ ప్రభావంతో ఒడిశాలో 9,885 మంది మరణించినట్లు అధికారిక సమాచారం. 50వేల మందికి పైగా మృతి చెందారని అనధికారిక వర్గాల అంచనా. 1,500 మంది బాలలు అభాగ్యులుగా మిగిలారు. 16,50,086 ఇళ్లు నేలమట్టం అయ్యాయి. 23,129 ఇళ్లు తుపాను ధాటికి కొట్టుకుపోయాయి.



1999 తుపాను ధాటికి నేలమట్టమైన ఇళ్లు

రూ.400 కోట్లతో..

ప్రాకృతిక విపత్తు నిర్వహణలో రాష్ట్రం ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచింది. ఈ వ్యవస్థను మరింత దృఢ పరిచేందుకు రాష్ట్రం సిద్ధమవుతోంది. అగ్నిమాపక దళం, ఒడిశా విపత్తు స్పందన దళం(ఒడ్రాఫ్) వర్గాల ఆధ్వర్యంలో సత్వర సహాయక, పునరుద్ధరణ కార్యకలాపాలను అత్యాధునికంగా మలిచేందుకు ప్రభుత్వం రూ.400 కోట్ల వ్యయ ప్రణాళిక ఖరారు చేసింది. వరదలు, తుపాను ప్రకృతి విపత్కర ప్రాంతాల్లో ఆశ్రయ కేంద్రాలు, వరద ముంపు నివారణకు ఆనకట్టల విస్తరణ పనులకు ప్రణాళిక చేపట్టారు. రూ.763 కోట్ల వ్యయ ప్రణాళికతో ఆనకట్టల ఎత్తు పెంచి, 5 మీటర్లు(16.4 అడుగులు) వెడల్పుతో విస్తరిస్తారు. తొలి దశలో బాలాసోర్, భద్రక్, కేంద్రాపడా, పూరీ జిల్లా ప్రాంతాల్లో ఈ పనులను కొత్త సంవత్సరంలో ప్రారంభించి.. రానున్న 3 ఏళ్లలో పూర్తి చేసేందుకు సంకల్పించారు.

జీవన సాఫల్యం..

దేశ విదేశాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రాష్ట్ర ఖ్యాతిని నలు చెరుగులా ప్రతిబింబించారు. 10 ఏళ్ల దీర్ఘకాలం తర్వాత నవీన్ పట్నాయక్ రోమ్, దుబాయ్ దేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత పోప్ ఫ్రాన్సిస్‌తో భేటీ అయ్యారు. రోమ్‌లో యునైటెడ్ నేషన్స్‌కు రాష్ట్రంలో ఆహార భద్రత ప్రత్యేకతను ప్రసారం చేశారు. న్యూఢిల్లీ, బెంగళూర్, ముంబై ప్రాంతాలను ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా సందర్శించి పెట్టుబడులను ప్రోత్సహించారు. దుబాయ్ పర్యటనతో పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులను విశేషంగా ఆకట్టుకున్నారు. భారీ స్థాయిలో పెట్టుబడులు రాష్ట్రానికి అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్ర బహుముఖ పురోగతి సాధనకు న్యూఢిల్లీ క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేసింది.

ఉత్తమ సేవలకు సత్కారం



పట్నాయక్‌ను సన్మానిస్తున్న ఐఐసీ ఈశ్వర తండి

జయపురం: ఉత్తమ అమో పోలీసు సమితి సభ్యుడిగా వల్లభ నారాయణ పట్నాయక్ సేవలు అభినందనీయమని జయపురం సదర్ పోలీసు స్టేషన్ అధికారి ఈశ్వర తండి అన్నారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయనను సత్కరించారు. జయపురం సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలు నియంత్రణలో పోలీసులకు ఎంతో సహకరించి, ఉత్తమ నాగరికునిగా నిలిచారని కొనియాడారు. పట్నాయక్ అందించిన సేవలకు 2022లో అమో పోలీసు సమితి ఉత్తమ సభ్యుడిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకారం అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

పసికందుల మృతిపై ఆందోళన

- ఆస్పత్రిలో ఆందోళనకు దిగిన బాధిత కుటుంబ సభ్యులు

జయపురం: స్థానిక పట్టణంలోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో ఇద్దరు నవజాత శిశువులు మరణించడంపై ఉద్రిక్తత నెలకొంది. వైద్యులు నిర్లక్ష్యం కారణంగానే పసికందులు మృతి చెందారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు ఆస్పత్రిలో శనివారం ఆందోళనకు దిగారు. బాధితులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆస్పత్రి అధికారులు ఎంత బుజ్జగించినా వారు శాంతించలేదు. విషయం తెలుసుకున్న జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణకుమార్ పాఢి అక్కడికి చేరుకున్నారు. బాధితులతో మాట్లాడి, ఘటనపై విచారణ చేపట్టడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.



ఆస్పత్రి వద్ద ఆందోళనలో బాధిత కుటుంబ సభ్యులు

నేత్రం.. సజీవం

బరంపురం నగరంలోని చిన్న బజార్ మెయిన్ రోడ్డులో నివాసం ఉంటున్న వ్యాపారి కె.కాంతారావు(77) తాను చనిపోతూ మరో ఇద్దరికి చూపు అందించి, ఆదర్శంగా నిలిచారు. శనివారం ఉదయం ఆయన అకస్మాతుగా మరణించగా, విషయం తెలుసుకున్న బరంపురం ఫ్రెండ్స్ హెల్పింగ్ క్లబ్ ప్రతినిధులు బాధిత కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. నేత్ర దానానికి వారు అంగీకరించడంతో ఎంకేసీజీ మెడికల్ కళాశాల ఆస్పత్రికి చెందిన నేత్ర వైద్య నిపుణు సాయంతో కాంతారావు నుంచి కార్నియా(కంటి పై పొర)ను సేకరించారు. వీటిని మరో ఇద్దరికి అమర్చడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను అభినందించారు. కాంతరావుకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

– బరంపురం



కాంతారావు నుంచి సేకరించిన కార్నియాను దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

సంప్రదాయ స్వాగతం..



యువరాజుకు స్వాగతం పలుకుతున్న పూజారులు, ప్రజలు

దశాబ్దాల క్రితం తమను సుభిక్షంగా ఏలిన రాజుల పట్ల ప్రజలకు నేటికీ అభిమానం తగ్గలేదు. జయపురం సమితి సొలప గ్రామంలో రాజ పూజారుల భేటీ జరిగింది. కొరాపుట్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రాజ పూజారులు, దిశారీలు, శిరా లతో పాటు రాజులతో సత్సంబంధాలు ఉన్న వారి వారసులు ఇందులో పాల్గొన్నారు. ఇందులో జయపురం మహారాజుల సంతానం, యువరాజు విశ్వేశ్వర చంద్రచూడ్ దేవ్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలు, రాచ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. విషయం తెలుసుకున్న పరిసర ప్రాంతాల ప్రజలు రాకుమారుడిని చూసేందుకు పోటెత్తారు. సమావేశంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్, తహసీల్దార్ ప్రధాని టులిఅమ్మ తదితరులు పాల్గొన్నారు.

– జయపురం

శిబిరం సత్ఫలితం..

మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ–79 పరిధిలోని తాండబాయి గ్రామంలో బీఎస్ఎఫ్ 142 బెటాలియన్ జవాన్లు శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. బెటాలియన్ కామెండెంట్ రాజ్‌పాల్ సింగ్ నేతృత్వంలో పరిసర గ్రామాలకు చెందిన 750మంది గిరిజనులకు వైద్య సేవలు అందజేశారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే మహిళలకు చీరలు, నిత్యావసర సామగ్రి పంపిణీ చేశారు. ఏ ఆపద వచ్చినా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. మావోయిస్టుల కార్యకలాపాలకు మద్దతు తెలపవద్దని, ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

– మల్కన్‌గిరి



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

న్యూస్‌రీల్

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి



విజయనగరం: ఆంగ్ల సంవత్సరాదిలో జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, జిల్లా మరింత అభివృద్ధి దిశగా పయనించాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సర వేడుకలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అందుబాటులో ఉండరని, పార్టీ శ్రేణులు, ప్రజలు గమనించాలని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి.

కొత్త సంవత్సరంలో శుభం కలగాలి



విజయనగరం అర్బన్: వచ్చే ఏడాది జిల్లా ప్రజలకు అన్ని విధాలా శుభం కలగాలని, సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు ముందస్తుగా శనివారం 2023 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నారు. జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగేలా సమష్టిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ బడుల్లో ప్రమాణాలతో కూడిన బోధన

- మంత్రి బొత్స సత్యనారాయణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం అర్బన్/పూల్‌బాగ్: ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యాబోధన చేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కమిటీ రూపొందించిన క్యాలెండర్, డైరీలను మంత్రి తన స్వగృహంలో శనివారం ఆవిష్కరించారు. ముందుగా జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల వార్షిక క్యాలెండర్‌ను ఆచరణలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సన్యాసిరాజు, అధ్యక్షుడు ఎం.వేణుగోపాల్, గౌరవాధ్యక్షుడు కె.సత్యం, రాష్ట్ర కౌన్సిలర్లు రాధాకృష్ణ, విజయ్‌కుమార్, తిరుపతిరావు,సత్యవతి పాల్గొన్నారు.

కర్నూలులో శాప్ వెయిట్‌లిఫ్టింగ్ లీగ్ పోటీలు

విజయనగరం: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న శాప్‌లీగ్ పోటీల్లో భాగంగా ఈ నెల 8, 9 తేదీల్లో కర్నూలు జిల్లా వేదికగా నిర్వహించే రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 విభాగంలో నిర్వహించే పోటీల్లో 2005 సంవత్సరం డిసెంబర్ 31వ తేదీన జన్మించిన వారు మాత్రమే పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. బాలుర విభాగంలో 49, 55, 61, 67, 73, 81, 89, 96, 102 కేజీల బరువుతో పాటు ఆపై బరువు ఉన్న క్రీడాకారులు, బాలికల విభాగంలో 40, 45, 49, 55, 59, 64, 71, 81 కేజీలతో పాటు ఆపై బరువు కలిగిన క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వచ్చే నెల 7వ తేదీ సాయంత్రం లోగా కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంకు చేరుకుని వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

పెళ్లయిన జంటలతో సఖి గ్రూపులు

విజయనగరం అర్బన్: బాలికలు, మహిళల ఆరోగ్యం, భవిష్యత్ కోసం ఏర్పాటు చేసిన సఖి గ్రూపులతో సత్ఫలితాలొస్తున్నాయని, కొత్తగా పెళ్లయిన జంటలతో ప్రత్యేకంగా గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్ నుంచి శనివారం టీమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సఖి సమావేశాల ఫీడ్‌బ్యాక్ అడిగి తెలుసుకున్నారు. కొత్తగా పెళ్లయిన జంటలతో సమావేశాలు ఏర్పాటు చేసి గర్భం దాల్చడం, బిడ్డలను కనడంపై ముందస్తు అవగాహన కలిగించాలన్నారు. గర్భం దాల్చిన తర్వాత 9 నెలల్లో కేవలం మూడుసార్లు మాత్రమే స్కానింగ్ అవసరమన్న విషయాన్ని తెలియజేయాలన్నారు. తల్లిపాల విశిష్టత, ఉత్తమ ఆహార పద్ధతులు, పౌష్టికాహారం తీసుకోవడంపై సలహాలు ఇవ్వాలన్నారు. సుఖ ప్రసవానికి ప్రాధాన్యమిచ్చేలా చూడాలన్నారు. బాల్య వివాహాలను నియంత్రించి, 10వ తరగతి ఉత్తీర్ణులైన బాలికలు ఇంటర్మీడియట్‌లో చేరేలా చైతన్యం కలిగించాలని సూచించారు. ప్రతి 4వ శనివారం మండల స్థాయిలో ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంల సఖి సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల సేవలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు చురుగ్గా పనిచేయాలన్నారు. ఇటీవల 8వ తరగతి పిల్లలకు టాబ్స్ ఇవ్వడం జరిగిందని, వాటి వినియోగంపై ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ డాక్టర్ అశోక్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమణకుమారి, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, మెప్మా పీడీ సుధాకరరావు, డీఈఓ లింగేశ్వరరెడ్డి, ప్రత్యేకాధికారులు పద్మావతి, అరుణకుమారి, డాక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

పూరీలో భక్తుల రద్దీ

- ఆంగ్ల సంవత్సరాది నేపథ్యంలో 3 అంచెల భద్రత
- అర్ధరాత్రి నుంచే ప్రత్యేక దర్శనానికి ఏర్పాట్లు



శ్రీమందిరం ఆవరణలో భక్తుల రద్దీ



బొడొ దండొలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బారికేడ్లు

భువనేశ్వర్: ఆంగ్ల సంవత్సరాది పురస్కరించుకుని పూరీ జగన్నాథుడు కొలువుదీరిన శ్రీమందిరం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతోంది. యాత్రికులు, పర్యాటకులు, సందర్శకుల రాకతో పట్టణంలోని హోటళ్లు ఇతరేతర సముదాయాల్లో రద్దీ ముమ్మరమైంది. ఈ నేపథ్యంలో జగన్నాథుని దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తుల సౌకర్యార్థం శ్రీమందిరం దేవస్థానం, పూరీ జిల్లా అధికార యంత్రాంగాలు ముందస్తు ఏర్పాట్లు చేశాయి. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రతి భక్తుడు, యాత్రికునికి సులభంగా, సంతృప్తికరమైన దర్శన సౌలభ్యం కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శనివారం అర్ధరాత్రి 1 గంటకు ద్వారాలు తెరిచి, దైనందిన సేవాదులు ప్రారంభించేందుకు నిర్ణయించారు. సేవాదులు ముగియడంతో భక్తులకు సర్వదర్శన సౌకర్యానికి కార్యక్రమం ఖరారు చేశారు. బొడొ దండొ మార్కెట్ కూడలి నుంచి 20 అడుగుల మేర తాత్కాలిక బారికేడ్లు ఏర్పాటు చేశారు. దర్శనం కోసం బారులు తీరిన భక్తులు, యాత్రికులకు ఎండ వేడిమి నుంచి రక్షణ కల్పించేందుకు వీటి చుట్టూ నీడనిచ్చే పరదాలు ఉన్నాయి. అలాగే శనివారం అర్ధరాత్రి నుంచి బొడొ దండొ మార్గంలో భారీ వాహనాల రవాణా నివారణకు ఆదేశాలు జారీ చేశారు.

భక్తులకు తాజా సమాచారం..

స్వామివారి దర్శనానికి నిరీక్షించే భక్తులకు తాజా సమాచారం ప్రసారం చేయనున్నారు. శ్రీమందిరంలో కొనసాగుతున్న సేవాదులు, పూజలు వగైరా సమాచారం కోసం బొడొ దండొ ఆవరణలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. శనివారం నుంచి పుంజుకున్న రద్దీ ఆదివారం వరకు నిరవధికంగా కొనసాగుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయం పరిసరాల్లో 3అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం 60 ప్లటూన్ల పోలీసు బలగాలను మోహరించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సౌకర్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ కన్వర్ విశాల్‌సింఘ్ తెలిపారు. బొడొ దండొ దారి పొడవునా నిర్వహిస్తున్న తాత్కాలిక దుకాణాలను తొలగించేందుకు స్థానిక మున్సిపాలిటీ ఉత్తర్వులు జారీ చేసింది.

శ్రామిక్ కాంగ్రెస్ నిరసన ర్యాలీ



పాదయాత్రలో పాల్గొన్న శ్రామిక్ కాంగ్రెస్ కార్యకర్తలు

భువనేశ్వర్: నిమ్న శ్రేణి ఉద్యోగుల క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి తూర్పుకోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఓపెన్ లైన్ శాఖ కార్యదర్శి లక్ష్మీధర మహంతి ఆధ్వర్యంలో మొటొరి నుంచి మాలతీపట్టపూర్ రైల్వేస్టేషన్ వరకు 29 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. 12 గంటలు నిరవధికంగా విధులు నిర్వహించే స్టేషన్ సూపర్ వైజర్ సిబ్బందికి ఓవర్ టైం భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. మొటొరి రైల్వేస్టేషన్‌లో సిబ్బందికి మరుగుదొడ్డి, డెలాంగ్ రైల్వేస్టేషన్ టికెట్ రిజర్వేషన్ కేంద్రంలో ఎయిర్ కండిషన్, సాక్షిగోపాల్ స్టేషన్ టీఆర్‌డీ కాలనీ వాసులకు సురక్షిత తాగునీరు సరఫరా వంటి మౌలిక సౌకర్యాల కొరత వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. పాదయాత్ర నివేదికను సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్‌చంద్ర సాహుకు దాఖలు చేయనున్నట్లు తెలిపారు. విధి నిర్వహణ రంగంలో సిబ్బందికి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మండల, జోనల్ అధికారుల సంప్రదింపులతో కృషి చేస్తున్నట్లు వివరించారు.

రెండో రోజుకు క్రైం బ్రాంచ్ దర్యాప్తు



అవశేషాలను సంగ్రహిస్తున్న క్రైం బ్రాంచ్ అధికారులు

- రష్యా ఎంపీ బస చేసిన హోటల్ సిబ్బందిని విచారించిన అధికారులు

రాయగడ: రష్యాకు చెందిన ఎంపీ సహా అతని సన్నిహితుడు అనుమానాస్పద రీతిలో మరణించిన ఘటనపై విచారణ నిమిత్తం రాయగడ చేరుకున్న క్రైంశాఖ అధికారుల దర్యాప్తు శనివారం రెండో రోజుకు చేరుకుంది. మరణాలపై వాస్తవాలను తెలుసుకునేందుకు క్రైం బ్రాంచ్ డీఎస్పీ సరోజ్‌కాంత్ మహంత నేతృత్వంలో 12మంది అధికారుల బృందం శుక్రవారం రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో స్థానిక శెరిగుడలోని శ్మశాన వాటికను పరిశీలించిన అధికారులు అక్కడ రష్యా ఎంపీ యాంథమ్ పావెల్, అతని స్నేహితుడు బెదినో వ్లాదిమర్ లను దహనం చేసిన ప్రాంతాల్లో అవశేషాలను సంగ్రహించారు. ఈ నేపథ్యంలో సంగ్రహించిన అవశేషాలను భుబనేశ్వర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తారని సమాచారం. మరోవైపు సాయి ఇంటర్ నేషనల్ హోటల్‌కి వెళ్లి సిబ్బందితో మాట్లాడారు. పోస్టుమార్టం నివేదికను జిల్లా ముఖ్య వైద్యాధికారి లల్‌మోహన్ రౌత్రాయ్ దర్యాప్తు అధికారులకు సమర్పించారు.

రైల్వే స్టేషన్‌లో నిరసన



భువనేశ్వర్: రైల్వేస్టేషన్‌లో ప్లకార్డుతో రష్యా పౌరుడు

భువనేశ్వర్: నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్ ఆవరణలో రష్యా పౌరుడు నిరసన ప్రదర్శిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు భువనేశ్వర్ ప్రభుత్వ రైల్వే పోలీసు(జీఆర్‌పీ) అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలియడంతో స్థానిక ఖారవేళ నగర్ ఠాణా పోలీసులు చొరవ తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఈ పౌరుడి పాస్‌పోర్టు సక్రమంగా ఉన్నప్పటికీ వీసా గడువు ముగిసినట్లు ధ్రువీకరించారు. దీంతో స్పెషల్ క్రైం బ్రాంచ్ పోలీసులు జీఆర్‌పీ ఠాణా చేరారు. 'నేను రష్యా నిర్వాసితుడను. యుద్ధానికి, అధ్యక్షుడు పుతిన్‌కు వ్యతిరేకిని. ఇల్లు లేని వాడిని. దయచేసి సాయం చేయండి.' అని ఇంగ్లిష్‌లో రాసిన నినాద ఫలకంతో రైల్వేస్టేషన్ ఆవరణలో నిరసన ప్రదర్శించారు. దీంతో అదుపులోకి తీసుకొని, వివరాలు సేకరిస్తున్నారు.

మల్కన్‌గిరి చేరుకున్న ట్రోఫీ

- హాకీ ప్రపంచకప్‌కు ఘన స్వాగతం పలికిన అధికారులు



సంప్రదాయ వాయిద్యాలతో స్వాగతం పలుకుతున్న గిరిజనులు



హాకీ ట్రోఫీకి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ విశాల్‌సింగ్, ఎస్పీ నితీష్, ఎమ్మెల్యే పూర్ణచంద్ర



ట్రోఫీని చూసేందుకు భారీగా తరలివచ్చిన క్రీడాభిమానులు, ప్రజలు

మల్కన్‌గిరి: హాకీ పురుషుల ప్రపంచకప్ ట్రోఫీకి జిల్లా కేంద్రంలో ఘన స్వాగతం లభించింది. కొరాపుట్ నుంచి శనివారం ఉదయం మల్కన్‌గిరి జిల్లాలోని ఖొయిర్‌పుట్ సమితి గోవిందపల్లి వద్దకు చేరుకున్న ట్రోఫీకి క్రీడాకారులు ఆహ్వానించారు. అనంతరం మత్తిలిలో మీదుగా మధ్యాహ్నానికి మల్కన్‌గిరి లోని భైరవి మందిరానికి చేరుకుంది. అక్కడ జిల్లా కలెక్టర్ విశాల్‌సింగ్, ఎస్పీ నితీష్ వాధ్వనీ, చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, క్రీడా, వివిధ శాఖల అధికారులు స్వాగతం పలికి, ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. సంప్రదాయ కోయ, బోండా తెగలకు చెందిన గిరిజన నృత్యాలను ప్రదర్శిస్తూ డీఎన్‌కే మైదానం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు క్రీడాకారులతో కొద్దిసేపు హాకీ ఆడి, వారిని ఉత్సాహ పరిచారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన




నాటకోత్సవంలో ఓ సన్నివేశం

పర్లాకిమిడి: క్రియేటివ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గత 4 రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి పరల నాటక మహోత్సవాలు ఆకట్టుకుంటున్నాయి. వివిధ జిల్లాలకు చెందిన కళాకారులు పాల్గొని, తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ఇందులో భాగంగా భువనేశ్వర్‌కు చెందిన పంజుధ్వని నాటక పరిషత్ కళాకారులు ప్రదర్శించిన గొటియే కహానీ నాటక ప్రదర్శన ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఆద్యంతాలు అత్యంత ఆసక్తికరంగా కొనసాగిన నాటక ప్రదర్శన కళాకారుల ప్రతిభకు అద్దం పట్టే విధంగా ఉంది. నాట్య పరిషత్ డైరెక్టర్ దీప్తిరంజన్ దాస్ దర్శకత్వంలో కొనసాగిన ఈ నాటకం ప్రస్తుత పరిస్థితులను ప్రతిబింబించింది. సమాజంలో చోటు చేసుకుంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్లు వివరించింది. ఈనెల 28 నుంచి ప్రారంభమైన నాటకోత్సవాలు శనివారంతో ముగిసాయని క్రియేటివ్ ఆర్ట్స్ సంస్థ అధ్యక్షుడు నృసింహచరణ్ పట్నాయక్ తెలిపారు. నాటక ప్రదర్శనలను చూసేందుకు కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

హ్యాపీ న్యూ ఇయర్





కాలచక్రం గిర్రున తిరిగింది. 2022వ సంవత్సరం కాలగర్భంలో కలిసిపోయింది. క్యాలెండర్‌లో చివరిపేజీ శనివారం చిరిగిపోయింది. కొంగొత్త ఆలోచనలు.. ఆశయాలు.. ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టే వేళ.. సంతకవిటి మండలం సిరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 2023 సంవత్సరానికి అంకెలతో స్వాగతం పలుకగా... ప్రజలందరి జీవితం కాంతివంతం కావాలని కాంక్షిస్తూ విజయనగరం నర్తనశాల నృత్య కళాశాల విద్యార్థినులు కొవ్వొత్తుల వెలుగులతో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం/రాజాం

మంచు కౌగిట..

- ఉదయం 10 వరకు మంచు తెరల మధ్య శ్రీకాకుళం



శ్రీకాకుళంలో ఉదయం పొగమంచు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లా మంచు దుప్పటి కప్పుకుంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం పది గంటల వరకు శ్రీకాకుళం నగరం మొత్తాన్ని పొగ మంచు కమ్మేసింది. ఎదుటి వాహనం కూడా కనిపించనంతగా మంచు కురిసింది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు చలికి తట్టుకోలేక ప్రజలు వణికిపోయారు. వేకువన పనులకు వెళ్లే వారికి మాత్రం మంచుతో కూడిన మనోహర దృశ్యాలు తారసపడ్డాయి. ప్రధాన రహదారులతో పాటు పచ్చని పంట పొలాలు, చెరువులు చుట్టూ కమ్ముకున్న మంచుతెరలు అందాలను ఆవిష్కరించాయి. ఈశాన్యం నుంచి చల్లని గాలులు, సముద్రం నుంచి వస్తున్న వేడి గాలులు క్రాష్ కావడం వల్ల ఒక్కసారిగా పొగ మంచు కురుస్తోందని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు చెబుతున్నా రు. ఈ మంచుతో శ్వాసకోస వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు, ఇదే పరిస్థితి కొనసాగితే జీడి, మామిడి తదితర ఉద్యానవన పంటలకు కాస్త ముప్పు ఉందని ఉద్యానవన శాఖ అధికారులంటున్నారు.

2న ఉత్తర ద్వార దర్శనాలు



విద్యుత్ దీపాలతో అలంకరించిన నారాయణ తిరుమల

- మాస్కులు తప్పనిసరి

శ్రీకాకుళం కల్చరల్: వైష్ణవ క్షేత్రాల్లో 2న ఉత్తర ద్వార దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాలను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తులు మాస్కులతో హాజరు కావాలని దేవదాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఆలయాల్లో విష్ణు సహస్ర నామ పారాయణాలు, సామూహిక పారాయణాలు జరుగుతాయి.

అరసవల్లి: అరసవల్లి ఆదిత్యక్షేత్రంలో సోమవారం ముక్కో టి ఏకాదశి ఉత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపా రు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భక్తులకు ఉత్తర ద్వారం నుంచే దర్శనాలుంటాయని తెలిపారు. అంతరాలయ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

క్లుప్తంగా

3న అంతర వర్సిటీ పోటీలకు ఎంపికలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం తరఫున అంతర వర్సిటీ పోటీల్లో పాల్గొనే మహిళల, పురుషుల ఖోఖో జట్లు, పురుషుల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు ఈ నెల 3న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి స్పోర్ట్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో ఉదయం 11 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. వర్సిటీ అఫిలియేషన్ కళాశాలల విద్యార్థులు ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



పొందూరు: మండలంలోని లైదాం రైల్వేగేటు సమీపంలో తుంగపేట వద్ద శనివారం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. నీలం టీషర్టు, లుంగీ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. వివరాలు తెలిసిన వారు 70132 73731 నంబరును సంప్రదించాలని కోరారు.

ఏపీ చెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా కిశోర్



శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా జిల్లాకు చెందిన బగాది కిశోర్ ఎన్నికయ్యారు. విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ వేదికగా ఇటీవల జరిగిన ఆంధ్ర చెస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో 13 జిల్లాలకు చెందిన ముఖ్య ప్రతినిధులు కిశోర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షునిగా వ్యవహరిస్తూ చెస్ అభివృద్ధికి పాటుపడుతున్నారని ఆంధ్రా చెస్ అసోసియేషన్ కార్యదర్శి సనపల భీమారావు తెలిపారు.

పీఎంజీకేఏవై పక్కాగా అమలుకావాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రధా నమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన (పీఎంజీకేఏవై) జిల్లా లో పక్కాగా అమలుకావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ పౌర సరఫరాల సిబ్బందిని ఆదేశించారు. శనివారం బలగలోని రేషన్ డిపో ను సందర్శించి బియ్యం పంపిణీని పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డులోని ప్రతి లబ్ధిదారునికి ఐదు కేజీలు చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వలంటీర్ల నుంచి కూపన్లు పొందాలని సూచించారు. సంపూర్ణ ఆహారంతో ఆరోగ్యకరమైన కుటుంబాన్ని అందించాలనేదే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో డీలర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


డిపాజిట్ కడితే ఇంటికి పుస్తకాలు



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు

లావేరు: నామమాత్రపు డిపాజిట్ కడితే గ్రంథాలయంలో ఉండే వివిధ పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లి చదువుకోవచ్చని లావేరు శాఖా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో శనివారం డిపాజిట్ కట్టిన విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

పోలీస్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీస్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్పీ జి.ఆర్.రాధిక ఆవిష్కరించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, పరిపాలనాధికారి శివరామరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ, జిల్లా అసోసియేషన్ సభ్యులు ఆర్.కృష్ణంనాయుడు, భుజంగరావు, నర్సింహులు, జగదాంబ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల విక్రయాలు అరికట్టాలి

శ్రీకాకుళం క్రైమ్ : మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం అఖిల భారత విద్యార్థి పరిషత్ విద్యార్థులు కోరారు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలో వివిధ కళాశాలల విద్యార్థులు పాతబస్టాండ్ మీదుగా అవగాహన ర్యాలీ చేపట్టారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.. మంచి భవిష్యత్తు ముందుంది.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కన్వీనర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో కొన్నిచోట్ల మత్తుపదార్థాలు విక్రయాలు జరుపుతున్నారని.. బలహీన క్షణాల్లో యువత వీటికి అలవాటుపడుతున్నారని చెప్పారు. పోలీసులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- ఏపీ ఎన్జీఓ, పీఆర్ మినిస్టీరియల్ సంఘాల క్యాలెండర్ల ఆవిష్కరణ



పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



ఏపీ ఎన్జీఓ జిల్లా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఏపీ ఎన్జీఓ జిల్లా శాఖ, పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆయన చాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సహకారంతో ప్రజలకు ఉత్తమ పాలన అందించటం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎం.అశోక్‌కుమార్, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, డీఎల్‌డీఓ జిఎస్.నిర్మలాదేవి, పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సిహెచ్.మురళి, ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు జె.మురళి, కార్యదర్శి సురేష్, జిల్లా కోశాధికారి ఎస్‌వీ సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డివి.రమణ, ఉపాధ్యక్షుడు వై.ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై పనిముట్లు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వం నిర్దేశించిన రాయితీ ధరలకే వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోని వ్యవసాయ పనిముట్ల తయారీదారులు, పంపిణీదారులతో జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పనిముట్ల ధరలు అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పనిముట్ల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ రైతుల పనిముట్ల ధరలను పరివేక్షిస్తుందని తెలిపారు. సమావేశంలో జిల్లా అధికారి కె.శ్రీధర్, జిల్లా ఉద్యానవన అధికారి ఆర్.వి.ప్రసాద్, రాగోలు పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.ఉదయ్‌బాబు, జిల్లా ఆగ్రోస్ మేనేజర్ చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు టి.భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిందితురాలి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ తిరుపతిరావు (వెనుక ముసుగులో నిందితురాలు)

విజయనగరం క్రైమ్: ఆటోలో తోటి ప్రయాణికురాలిలా వెళ్తూ, ప్రయాణికుల బ్యాగ్‌లను తస్కరించి అందులో నుంచి బంగారు ఆభరణాలను చోరీ చేసిన నిందితురాలిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ సిఐ టివి.తిరుపతిరావు శనివారం అందించిన వివరాలు.. మండల పరిధిలోని ముడిదాం గ్రామానికి చెందిన గంధ్రేటి గాయత్రి కుటుంబ సభ్యులతో కలిసి 2022 నవంబరు ఆరో తేదీన చీపురుపల్లిలో ఉన్న అత్తవారింటికి ఫంక్షన్ నిమిత్తం బంగారు ఆభరణాలను తీసుకువెళ్లింది. అటు నుంచి తిరిగి విజయనగరం ఆటోలో వస్తుండగా మెంటాడ మండలం పిట్టాడ గ్రామానికి చెందిన గొర్లె మౌనిక ఆటో ఎక్కింది. కొంత దూరం ప్రయాణించిన తర్వాత ఆమె దిగి వెళ్లిపోయింది. అయితే గాయత్రీ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో దిగింది. బ్యాగ్ ఓపెన్ చేసి ఉండడం గమనించి, బ్యాగ్‌లో ఉన్న ఏడుతులాల బంగారు ఆభరణాలు పోయినట్లు గుర్తించింది. వెంటనే రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. శనివారం ముడిదాం సమీపంలో ఆటో నుంచి దిగి అనుమానాస్పదంగా తిరుగుతున్న మౌనికను రూరల్ పోలీసులు పట్టుకుని విచారించారు. విచారణలో ఏడు తులాల బంగారు ఆభరణాలను తానే చోరీ చేసినట్లు అంగీకరించిందన్నారు. ఆమె నుంచి బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పూర్తి స్థాయిలో చోరీ సొత్తును రికవరీ చేసిన రూరల్ ఎస్ఐ గణేష్, ఏఎస్ఐ త్రినాధరావు, కానిస్టేబుల్ షఫీలను ఎస్పీ ఎం.దీపిక అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



సంఘటనా స్థలం వద్ద తుప్పల్లో విష్ణుమూర్తి మృతదేహం

రేగిడి : మండల పరిధిలోని బూరాడ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. రేగిడి ఎస్ఐ కె.శ్రీనివాసరావు అందించిన వివరాలు.. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని తెలిపారు. ప్రమాదంలోని మండలం పెద్దశిర్లాం గ్రామానికి చెందిన సంచాన విష్ణుమూర్తి(42) మృతి చెందినట్లు గుర్తించామని వెల్లడించారు. శనివారం ఉదయం బూరాడ సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించామని, మృతుడిది పెద్దశిర్లాం గ్రామంగా గుర్తించామని అన్నారు. విజయనగరం కేబుల్ సామగ్రి కొనుగోలు నిమిత్తం శుక్రవారం వెళ్లిన విష్ణుమూర్తి తిరిగి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుని ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు రోడ్డు పక్కన తుప్పల్లో పడి ఉన్నాడని వెల్లడించారు. ఈయనకు తలపై ప్రమాదగాయాలు ఉన్నట్లు వివరించారు. ఈయనకు భార్య అప్పలనారాయణతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా సంఘటనా స్థలాన్ని సర్పంచ్ రాంబాబుతో పాటు వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు పరిశీలించారు.

కుమ్మరిగుంటలో గజరాజులు

కొమరాడ: మండల ప్రజలకు గజరాజుల బాధలు వీడడం లేదు. రెండు వారాలుగా అర్థంరిజర్వు ఫారెస్టును ఆనుకొని ఉన్న కుమ్మరిగుంట రహదారిపై గజరాజులు తిష్ట వేశాయి. దీంతో కుమ్మరిగుంట, రాజ్యలక్ష్మీపురం ప్రజలు రాత్రి పూట తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో టమాట, జామ, బొప్పాయి వంటి వాణిజ్య పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


ద్రవ జీవామృతంతో భూసారం



తయారీపై శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ద్రవ జీవామృతంతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ప్రచారకులు అరుణ, పోలీస్ వివరించారు. ద్రవజీవామృతం తయారీ, వినియోగం పై శనివారం కొంగరాంలో ప్రకృతి వ్యవసాయ రైతులకు అవగాహన కల్పించారు. ఆవుపేడ, మూత్రం, నీటితో జీవామృతం తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది హేమలత, స్వయం సహాయక సంఘం మహిళలు పాల్గొన్నారు.

హైందవమార్గమే 'మేలుకొలుపు'



మేలుకొలుపులో భజన చేస్తున్న భక్తులు

గార: హైందవ మార్గమే మేలుకొలుపులో ఒక పద్ధతని శ్రీపురం గ్రామానికి చెందిన శ్రీరామ భజన బృందం ప్రతినిధి ఉంగటి చిన్నంనాయుడు అన్నారు. 40 ఏళ్లుగా మేలుకొలుపు భజనల ద్వారా ధనుర్మాస రోజుల్లో పలు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. శనివారం వేకువజామున రామచంద్రాపురం పంచాయతీ శిమ్మపేట, అంబటివానిపేట, జొన్నలపాడు తదితర గ్రామాల్లో మేలుకొలుపు నిర్వహించారు. పలు భక్తిగీతాలు ఆలపించారు.

విద్యాభివృద్ధికి కృషిచేయాలి



ఏపీటీఎఫ్ డైరీ ఆవిష్కరిస్తున్న డీఈఓ, సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ పిలుపునిచ్చారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ(247/1947) డైరీ, క్యాలెండర్, జీవో పుస్తకాలను శనివారం ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, జిల్లా ధ్యక్షుడు మజ్జి మదన్మోహన్, జిల్లా కార్యదర్శులు చావలి శ్రీనివాస్, దాసరి రామ్మోహన్‌రావు, రాష్ట్ర కౌన్సిలర్ సదాశివుని శంకరరావు, సీనియర్ నాయకులు రొతు గణపతిరావు, నాయుడు పాల్గొన్నారు.

11 నుంచి సంక్రాంతి క్రీడా సంబరాలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన, చింతాడ రవికుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని రావికంటిపేటలో ఈ నెల 11 నుంచి 13 వరకు 'జగనన్న సంక్రాంతి సంబరాలు' పేరిట ఉత్తరాంధ్ర స్థాయిలో వాలీబాల్ పోటీలు, జిల్లాస్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యం వెలికి తీసేందుకు పోటీలు దోహదపడతాయని చెప్పారు. వాలీబాల్, కబడ్డీ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన ఇరు జట్లకు చెరో రూ.50వేల చొప్పున, రెండో స్థానానికి రూ. 30 వేలు, మూడు, నాలుగో స్థానంలో నిలిచిన జట్లకు రూ.20 వేలు చొప్పున నగదు బహుమతులు, ట్రోఫీ లు అందజేయనున్నట్లు రవికుమార్ వివరించారు. క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు.క్రీడలతోపాటు మహిళలకు ముగ్గులు పోటీలు, విద్యార్థులకు జగనన్న నవరత్నాల పథకాలకు సంబంధించి విశ్లేషణాత్మక పోస్టర్స్ తయారీ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆమ దాలవలస నియోజకవర్గ వైఎస్సాఆర్ సీపీ నాయకులు చిగురుపల్లి రవికుమార్, బత్తుల లక్ష్మణరావు,, కెప్టెన్ పైడి రామారావు, అన్నెపు కృష్ణ పాల్గొన్నారు.

వరి చేను కుప్పలు దగ్ధం



ఉద్దవోలులో దగ్ధమైన వరిచేను కుప్పలు

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామానికి చెందిన కోటి గురువులుకు చెందిన ఎనిమిది వరి చేను కుప్పలను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. బాధిత రైతు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల తన ఎకరా 30సెంట్ల పొలంలో కోసిన వరిచేను ఎనిమిది కుప్పలుగా వేసి పొలంలోనే ఉంచానన్నారు. శుక్రవారం రాత్రి సమయంలో పొలంలో ఉన్న వరిచేను కుప్పలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దాదాపు 38 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చే ఎనిమిది వరిచేను కుప్పలు పూర్తిగా కాలిపోయాయన్నారు. తన పొలంలో ఉన్న వరిచేను కుప్పలు కాలిపోతున్నాయని శనివారం ఉదయం తెలియడంతో వెంటనే కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి చూసే సరికి వరిచేను కుప్పలన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయని చెప్పారు. ఇదే విషయాన్ని స్థానిక వీఆర్‌ఓ, వీఏఏ, తెర్లాం పోలీసులకు తెలియజేశాన న్నారు. విషయం తెలుసుకున్న వెంటనే తెర్లాం ఎస్ఐ ఆర్.రమేష్ సిబ్బందితో ఉద్దవోలు వెళ్లి దగ్ధమైన వరిచేను కుప్పలను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ ప్రతినిధి విజయప్రసాద్, వీఆర్‌ఓ రవి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు సంఘటనా స్థలానికి వెళ్లి దగ్ధమైన వరి చేను కుప్పలను పరిశీలించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతు ఫిర్యాదు చేశాడు.

మాల్దీవుల్లో చిక్కుకున్న సిక్కోలువాసులు




సమస్య వివరిస్తున్న జిల్లావాసులు

ఇచ్ఛాపురం:

మాల్దీవుల్లో చిక్కుకుపోయిన తమను కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాలని ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాలకు చెందిన బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. విశాఖలోని ఓ ఏజెంట్ ద్వారా శ్రీకాకుళం జిల్లాకు చెందిన 27 మందితో పాటు ఒడిశాకు చెందిన ఐదుగురు యువకులు మాల్దీవుల్లోని జావ్స కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ కంపెనీకి గత ఏడాది ఉపాధి కోసం వెళ్లారు. మూడు నెలలు జీతాలు ఇచ్చి తర్వాత చెల్లించలేదు. మిగిలిన నెలల జీతాలు చెల్లించాలని అడిగితే పాస్‌పోర్టులు తీసుకొని వారు చెప్పినట్టే చేయాలని ఇబ్బంది పెడుతున్నారని బాధితులు వాపోయారు. ప్రభుత్వం చొరవ తీసుకుని తమను స్వగ్రామాలకు తీసుకురావాలని కోరుతున్నారు.

డిగ్రీ విద్యలో ప్రమాణాలకు ప్రాధాన్యత



మాట్లాడుతున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డిగ్రీ విద్యలో ప్రమాణాలు విధిగా పాటించాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో శనివారం డిగ్రీ కోర్సుల బోర్డాఫ్ స్టడీస్ చైర్మన్లు, సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అవసరాలు, ఉద్యోగ, ఉపాధి కల్పన దృష్టిలో పెట్టుకుని బోధ న సాగించాలన్నారు. ఉన్నత విద్యామండలి అకడమిక్ క్యాలెండర్ మేరకు క్లాస్ వర్కు, పరీక్షలు జరగాలన్నారు. కాలనుగుణంగా సిలబస్‌ల్లో మార్పులు తప్పనిసరని స్పష్టం చేశారు. డిగ్రీలో ఇంటర్న్‌షిప్, విద్యార్థుల ప్రయోజనం కోసం సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచే డిజీ లాకర్ సిస్టం వంటివి ప్రారంభించినట్లు చెప్పారు. ఉద్యోగ అవకాశాలకు దోహదపడే కొత్త కోర్సు లు ప్రారంభం లక్ష్యంగా ముందుకు సాగుతున్న ట్లు తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ బిడ్డి క అడ్డయ్య, డీన్‌లు ఉదయ్‌భాస్కర్, అనురాధ, పాలక మండలి సభ్యులు రాజేష్, స్వప్న వాహిణి, రాజేష్, చిన్నారావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

జి.సిగడాం: గ్రామాల్లో నెలకొన్న భూసమస్యలపై ఎవరూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు సూచించారు. శనివారం తన కార్యాలయంలో వీఆర్‌ఓ, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయ రుణాల రెన్యువల్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. వన్-బీ రాకపోతే సంబంధిత వీఆర్‌ఓ నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ నిర్మల, ఆర్ఐ రామచంద్రరావు, వీఆర్‌ఓలు భూపతి నర్సింగరావు, పిన్నింటి సింహాచలం, నీలకంఠం, ఎరకయ్య, జగన్నాథం పాల్గొన్నారు.

పెండింగ్ మస్టర్లపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రఘురాం

గార: ఉపాధి హామీ పథకంలో వేతనదారుల పెండింగ్ మస్టర్లపై అధికారులు దృష్టి సారించాలని కె.సైరిగాం సర్పంచ్ మార్పు ఆదినారాయణ కోరారు. శనివారం గార మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఏటా అధికారుల నిర్లక్ష్యం వల్ల వేతనదారులు నష్టపోతున్నారని చెప్పారు. దీనిపై ఎంపీపీ రఘురామ్ స్పందిస్తూ పూర్తి నివేదికలతో హాజరుకావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ, ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు, డీటీ ప్రసాదరావు, వాడాడ సర్పంచ్ సుంకాన సురేష్, సుగ్గు మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం



పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న పిన్నింటి సాయికుమార్

రణస్థలం: మహిళలు పెరటి కోళ్ల పెంపకంతో అధిక ఆదాయం అర్జించవచ్చని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. రణస్థలం వెలుగు కార్యాలయం ఆవరణలో పలువురు మహిళా లబ్ధిదారులకు పెరటి కోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 50 యూనిట్ల పెరటి కోళ్లు, దాణా బ్యాగులు వచ్చాయని, ఒక్కో యూనిట్ విలువ రూ.3975 అని వివరించారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు మైలపల్లి కామరాజు, మహంతి పెదరామినాయుడు, పిల్ల ఆనందరావు పాత్రుడు, పచ్చిగుళ్ల సాయిరాం, మహంతి సత్యనారాయణ, ఎంపీడీఓ ధనుంజయరావు, ఏపీఓ శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.